# చిగురుటాకులు

"అమ్మా ఓ రెండు రూపాయలు కావాలి నాకు. ఇవ్వవూ?" హడావుడిగా వచ్చాడు గోపీ.

"ఎందుకురా? ఇదిగో, ఈ కాఫీ త్రాగు ముందు."

"వాళ్ళ రామూ బంతి కొనుక్కున్నాడు. నేనూ కొనుక్కుంటాను."

"ఎందుకులే బాబూ. అనవసరమైన వాటికి కూడా అలా డబ్బు దూబరా చేయకూడదు. వుందిగా నీ దగ్గర ఓ బంతి?"

"అది చిన్నది, పాతబడి పోయింది. రామూ వాళ్ళందరూ పెద్ద క్రొత్త బంతులు కొనుక్కున్నారు. రెండ్రూపాయలే గదమ్మా? ఇవ్వకపోతే నేనీ కాఫీ త్రాగనే త్రాగను."

"మా తండ్రివి కదూ? అలా కోపగించకూడదు, త్రాగేసెయ్యి. ఇప్పుడు నా దగ్గర డబ్బుల్లేవుగానీ రేపు మీ నాన్నగార్ని అడుగుదువుగానిలే."

"మరైతే మళ్ళీ రేపు 'ఊ' దనకూడదు. ఏం?"

"అననుగా? నేనే చెప్పి యిప్పిస్తాను మీ నాన్న గారితో. పోయి ఆడుకో మరి."

"ఓ!"

పరుగెత్తి పోతూన్న గోపీనే చూస్తూన్న జానకి ప్రక్కింటి సుబ్బమ్మ పలకరించగా ఇటు చూచింది.

"ఏమిటి జానకీ, పిల్లాడు ఎందుకో మారాం చేస్తూన్నట్లుంది?"

"ఏముంది పిన్నిగారూ? ఆనాటి కానాడు పెరిగిపోతూన్న ధరలతో మనం ఎంత అవస్థ పడిపోతూన్నామో పిల్లలకేం తెలుస్తుందీ? మాటికీ చీటికీ 'ఇది కావాలి—అది కావాలి' అంటూంటారు, ఏదో చెప్పి మరిపించాను."

"ఔనమ్మాయ్, అందరి యిక్కట్లూ అలాగే వున్నాయ్. ఈరోజు ఇరవయ్యో తారీఖు. అప్పుడే అబ్బాయి తెచ్చిన నెల జీతమంతా అయిపోయింది. ఈరోజు బజారు ఖర్చుకు ఓ పైసా కూడా మిగలలేదు యింట్లో. ఓ పది రూపాయలు సర్దుదూ, జీతం రాగానే యిచ్చేస్తాను."

"అయ్యో పిన్నిగారూ, నా దగ్గఱ మాత్రం అంత ఎలా వుంటుంది చెప్పండీ? అందరం ఒకే రకం గొఱ్ఱెతోక బ్రతుకులు బ్రతుకుతున్నాం గదా!"

"పోనీ ఓ అయిదు వుంటే ఇద్దూ, మిగిలినది ఎదురింటావిడని అడుగుతాలే."

"నాలుగున్నాయి. ఇస్తాను తీసుకోండి."

"ఏదో ఎంతో కొంత, ఇయ్యమ్మా. ఇప్పుడు నువ్వు యిస్తేనే పోయి కూరలవీ తెచ్చి వంట చేస్తాను."

"ఇదిగో, ఇప్పుడే తెస్తా" అంటూ వంటగదిలోకి వెళ్ళి అల్మారాలో చూచిన జానకి కనుబొమలు ముడిపడ్డాయి.

వస్తువులన్నీ ఇటువి అటూ, అటువి యిటూ కదుపుతూ వెదికిన చోటనే మఱలా మఱలా వెదక సాగింది.

"ఏమిటమ్మా ? ఏమిటలా ఒకటే హైరాన పడుతున్నావూ ?" వెనకనే వచ్చి నిలబడ్డ సుబ్బమ్మ ఆరాగా అడిగింది.

"ప్రొద్దున్న చాకలికి యివ్వగా మిగిలిన నాలుగు రూపాయిలూ ఇక్కడే పెట్టానండీ, రెండే వున్నాయి !"

సుబ్బమ్మ కనుబొమలు పైకి లేచాయి.

"నీకు బాగా జ్ఞాపకమేనా ?"

"అయ్యో, నా చేత్తో నేనే యిక్కడ పెట్టానండీ, ఈ కాఫీపొడి డబ్బా క్రింద."

"అన్నట్టు, మీ పని మనిషికి చేతివాటం వుందిగా?"

"అది ఈ రోజు నాగా పెట్టింది."

సుబ్బమ్మ చోద్యంగా బుగ్గలు నొక్కుకుంది.

"ఇంకెవరున్నారే అమ్మాయ్ యింట్లో ? గోపీ గానీ తీసుకున్నాడేమో ?"

జానకి బాధగా చూచింది.

"వాడికి అటువంటి అలవాట్లు లేవు పిన్నిగారూ. అయినా పదేళ్ళైనా లేని ముక్కు పచ్చలారని వాడు."

"కన్న తీపి కొద్దీ మనం అలాగే అనుకుంటాం. బుద్ధులు మారటానికి ఎంతసేపు కావాలి ?"

"లేదు పిన్నిగారూ, మా యింటా వంటా అలాంటి గుణాలు ఎవరికీ లేవు."

"లేకపోతే మంచిదే కానీ, లేనివి రావటాని కెంతసేపే వెఱ్ఱిపిల్లా ? మరేం లేదూ, నేనంటూన్నందుకేమీ అను కోకుగానీ వాళ్ళ రామూ లేడూ—ఎదురింటి వారబ్బాయి—అన్నీ దొంగ గుణాలే—ఇంట్లో వస్తువులూ, డబ్బులూ అన్నీ తీసుకు పోతూంటాడని వాళ్ళమ్మ ఒకటే గోల. పదిరూపా యల నోటు తీశాడని ప్రొద్దున్న కొడుతూంటే చూశాను. మరి వాడితోటే మీ గోపీకి స్నేహం. వాడి బుద్ధులు వీడికి మప్పి పెడుతున్నాడేమో మరి !"

జానకి అవాక్కుగా, అయోమయంగా చూడసాగింది.

"ఏమోలే, నీ మంచి కోరేదాన్ని గనుక చెప్పా నమ్మా. ఏమీ అనుకోకు. ఇలాతే ఆ రెండ్రూపాయలతోనే అవసరం గడుపుకుంటాను మరి !" నెత్తిన ముసుగు సవరించు కుంటూ వెళ్ళిపోయింది సుబ్బమ్మ.

తిరిగీ అలమారా అంతా వెదకింది జానకి.

కానీ ఆ శ్రమ నిష్ప్రయోజనమే అయ్యింది.

సుబ్బమ్మ మాటలు చెవులలో హోరెత్తుతున్నాయి.

నిష్కారణంగా రెండు రూపాయలు పోయాయి అనే బాధ ఆమెకు బాగా కోపం కలిగించింది.

గబగబా వీధి గుమ్మంలోకి నడిచి అటూ యిటూ చూచింది.

గోపీ, రామూ బంతులతో ఆడుకొంటున్నారు రాస్తా మీద.

'అదుగో, సుబ్బమ్మ అన్నట్టుగానే వీడికి ఎప్పుడూ ఆ అల్లరి వెధవతోనే స్నేహం. అన్నట్టు ......గోపీకి ఆ బంతి ఎక్కడిది చెప్మా ?'

అప్పటికప్పుడే ఆమెలోని అనుమానబీజం మహా వటవృక్షమై పోయింది.

"ఒరేయ్ గోపీ ! మాట, ఇటురా." అని కఠినంగా పిలచింది.

"ఆడుకుంటున్నానమ్మా." గోపీ సమాధానం.

"తెలుసు, ఇటురా." మరింత కర్కశ స్వరంతో అన్నది. ఈసారి గోపీ దగ్గరిగా వచ్చాడు.

"ఏమిటమ్మా ?"

"ఎక్కడిదిరా నీకా బంతి ?"

గోపీ జంకుగా చూచాడు.

"మాట్లాడవేం ?" ఉరిమింది.

"అమ్మా......మరేం......కోప్పడకమ్మా......"

"ఏమిటా ఖంగారు భడవా? కొనుక్కోవడానికి డబ్బు లెక్కడివి? చెప్పవేం?"

"మరీ......ఇందాక అలా నడుస్తూంటే రోడ్డు మీద రెండు రూపాయలనోటు దొరికింది. దానితో కొనుక్కున్నాను."

"వెధవా! ఎక్కడ నేర్చావ్‌రా ఈ అబద్ధాలన్నీ? అలమార్లో డబ్బు తీశావ్ కదూ? నిజం చెప్పు?"

గోపీ బెదరిపోతూ ఏడుపు స్వరంతో అన్నాడు:

"లేదమ్మా, నువ్వెక్కడ పెట్టావో చూడు, లేకపోతే అడుగు."

"చూశాను. లేదు. అందుకే అడుగుతున్నాను."

"అయ్యో, నేను తీయలేదమ్మా."

వెంటనే గోపీ బుగ్గ అదిరిపోయేట్లు కొట్టింది జానకి.

"వెధవా, ఎక్కడ నేర్చావురా ఈ తప్పుడు పనులు? నిజం చెప్పు? ప్రొద్దున్న నా చేత్తో నేను పెట్టిన డబ్బుకు రెక్కలొచ్చాయా?"

"నిజంగా నేను తీయలేదమ్మా. నాకు రోడ్డు మీదనే దొరికింది." ఏడుస్తూ అన్నాడు.

అంతవఱకూ నిలబడి చూస్తూన్న రామూ అన్నాడు: "నిజంగా వాడికి రోడ్డుమీద రెండు రూపాయలనోటు దొరికింది. నేను చూశానండీ."

"చాల్లే. పిల్లికి ఎలుక సాక్ష్యం! గోపీ నిజంచెప్పు. లేకుంటే చీరేస్తాను."

"నేను చెప్పింది నిజమేనమ్మా."

జానకికి ఓర్పు ఎగిరిపోయింది. ఎక్కడ తగిలేదీ చూడకుండా ఎడాపెడా బాదేసింది.

"దొంగతనం, అబద్ధాలు, పెంకితనం - ఎప్పుడు నేర్చుకున్నావురా యివన్నీ? మరెప్పుడూ ఇలా చేయవు కదా?"

"అమ్మోయ్, బాబోయ్, కొట్టకమ్మా. నేనే తీశాను."

జానకి ఆవేశంతో రొప్పుతోంది.

"దొంగ వెధవా! ఇంకెప్పుడూ తియ్యనని అను."

"తియ్యను." వెక్కిళ్ళతో అన్నాడు గోపీ.

"దొంగతనం తప్పు, అని చెప్పి లెంపలు వాయించుకో."

"దొంగతనం తప్పు. ఇంకెప్పుడూ చేయను." ఏడుస్తూనే లెంపలు వాయించుకున్నాడు.

"ఏమిటి జానకీ అది?"

అప్పుడే వస్తూ అడుగుతూన్న భర్తను గమనించిన జానకి క్రోధం యింకా ఎక్కువైంది.

"మాశారా ఏడి పనులు? నేను ఉదయం వంటింటి అలమారాలో నాల్గురూపాయలు పెడితే రెండు లేవు.

తీసుకుపోయి అవీ యివీ కొని తగలేశాడు. పైగా 'తీయలేదు రోడ్డుమీద దొరికిం'దని అబద్ధాలు !"

మరో దెబ్బ వేసింది.

గోపీ నిస్సహాయంగా ఏడ్వసాగాడు.

"వుండు జానకీ, కొట్టకు." అదిలింపుగా అన్నాడు! "ఏరా గోపీ, నిజంగా తీశావా?"

భయంగా జాలిగా చూచాడు గోపీ.

"ఇంకెప్పుడూ తీయను నాన్నా. నువ్వు కూడా కొట్టకు."

"తీశావా లేదా అని అడుగుతున్నాను,నిజంగా నువ్వు తీశావా? ఎప్పుడు తీశావు?" గంభీరంగా అడిగిన ఆ తీరు గోపీ భయాన్ని అధికం చేసింది.

"నిజంగా నేను తీయలేదు నాన్నా, నేను అలాంటి తప్పుపనులు ఎప్పుడూ చేయను నాన్నా, అమ్మ రెండ్రూపాయలు యిస్తే, నాకు దొరికిన డబ్బుకు కలిపి మంచి బంతి కొనుక్కుందా మనుకున్నాను. అమ్మ లేదంటే చిన్న బంతి కొని తెచ్చుకున్నాను."

"వెధవా మళ్ళీ అబద్ధం. ఇప్పుడేగా తీశానని ఒప్పుకొన్నావ్?" జానకి అరిచింది.

"ఆగు జానకీ నువ్వు...గోపీ, నువ్వు భయపడకుండా నిజం చెప్పు."

"నిజంగా నేను తీయలేదు నాన్నా. అమ్మ కొట్టటం మానేస్తుంది కదా అని ఒప్పుకొన్నాను తీశానని."

"నువ్వు చేయని పనికి ఎవరేమన్నా సరే - కొట్టినా తిట్టినా ఎప్పుడూ ఒప్పుకోకూడదు. దొంగతనం ఎటువంటిదో, ఆత్మవంచన కూడా అటువంటిదే. మరో సంగతి—నీది కాని సొమ్ము నీవు తీసుకోకూడదు. అదీ అపరాధమే. దాని హక్కుదారులు ఎక్కడో వుంటారు. తమది కాని సొమ్మును ఆశించడం అపరాధం. అందుకే యిప్పుడు దెబ్బలు తగిలాయి. తెలిసిందా?"

"తెలిసింది. ఇంకెప్పుడూ ఏం దొరికినా తీసుకోను నాన్నా."

"పోయి ముఖం కడుక్కురా. అన్నం తిందాం."

గోపీ పెరట్లోకి వెళ్ళాక, జానకి భర్తను గర్హించినట్లుగా అన్నది.

"బాగుంది. అదేనా వాడికి భయం చెప్పే తీరు?"

"నువ్వు అక్కడ పెట్టిన డబ్బు యింకెందుకూ వాడ లేదా? గుర్తుకు తెచ్చుకో."

"ఐతే నన్నే అంటున్నారన్నమాట?"

"కాదు, ఎన్నో పనుల తొందరలో వుండి ఎందుకైనా ఖర్చుపెట్టి మర్చిపోయి వుండవచ్చు."

"చాల్లెండి, పిల్లలు తప్పు చేసినప్పుడు ఇద్దరం బుద్ధి

చెప్పుకోవాలి కానీ, ఒకరు కోప్పడినప్పుడు ఒకరు లాలిస్తే యిక వాడేం బాగుపడతాడు?"

"నన్ను తర్వాత కోప్పదువుగాని కానీ, ప్రొద్దున్న నేను ఆఫీసుకు వెళ్తూ నీ దగ్గఱ రెండ్రూపాయలు తీసు కున్నాను. గుర్తుందా?"

వింటూనే జానకి వెర్రి ముఖం వేసింది.

"అయ్యయ్యయ్యో! పిల్లాడిని అనవసరంగా కొట్టే శానే! నా చేతులు పడిపోనూ. గోపీ ఇలారా నాయనా."

"చాలుకానీ ఆగు. నీ ఆవేశమంతా పిల్లలముందు అలా ప్రదర్శించవచ్చా? ఆగ్రహమొచ్చినా పట్టలేవు. అనుగ్రహ మొచ్చినా పట్టలేవు."

"మీారుండండీ, పసి వెధవని నిష్కారణంగా బాదే శానే. కాస్త జ్ఞాపకమొచ్చి చచ్చింది కాదు."

"ఇప్పటికే నువ్వు చేసింది చాలా తప్పు. నువ్వు పెట్టిన చోట డబ్బులేదని తొందర పడ్డావే కానీ, వాడెప్పుడైనా యిటువంటి పనులు చేశాడా అని ఆలోచించావా? నీ ఆవేశ మంతా ప్రదర్శించి వాడి ఎదుట అసహ్యకరంగా ప్రవర్తిం చావ్. చెయ్యని నేరాన్ని వాడిచేత బలవంతంగాఒప్పించావ్. ఇప్పుడు నీ తప్పును అంగీకరించి, వాడిమీాద ప్రేమ వర్షించా వంటే వాడి దగ్గఱ లోకువకాదూ ? ఇది అవకాశంగా తీసు కొని రేపు వాడు పదిరూపాయలు తీసినా ఏ ముఖంతో అడుగుతావు? ఈనాటి సంఘటనను అడ్డుగా పెట్టుకుంటాడు.

పెద్దవాళ్ళం కదా అని యిష్టం వచ్చినట్టు ప్రవర్తించకూడదు. అధికారం చిగురుటాకు వంటిది. ఎండ తగిలి వాడిపోకుండా కాపాడుకోవాలి!"

"నిజమే."

"అంచేత జరిగిందేదో జరిగిపోయింది. మరచిపో. ఈ విషయం వాడికి తెలియనీయకు. మరెప్పుడు యిలా జరగకుండా కాస్త నిదానంగా ప్రవర్తించు. పసిమనసు కూడా చిగురుటాకువంటిది. మోటుతనం చేస్తే చినిగిపోతుంది. చిగురుగా వున్నప్పుడు చిన్న ముల్లు గుచ్చుకున్నా ఆ గుర్తు ప్రభావం ఆకు ముదిరి పండి రాలిపోయేవరకూ శాశ్వతంగా వుంటుంది.